# సమయస్ఫూర్తి

ఒక పల్లెలో అర్ధరాత్రివేళ అందరూ గాఢనిద్రలో వున్నారు. హఠాత్తుగా, "దొంగలు! దొంగలు!" అని కేకలు వినిపించాయి.

నిద్రలో వున్నవాళ్ళు ఉలిక్కిపడి లేచి కత్తులూ, కర్రలూ తీసుకుని వీధుల్లోకి వచ్చారు. అక్కడ వాళ్ళకు దుర్గయ్య అనే యువకుడు కనిపించాడు.

"దొంగలెక్కడ?" అని వాళ్ళు దుర్గయ్య నడిగారు.

దుర్గయ్య దాపులనున్న మర్రిచెట్టు చూపించాడు. అందరూ మర్రిచెట్టు చుట్టూ చేరారు. వెన్నెల వెలుగులో వాళ్ళకు చెట్టు మీద, దొంగలెవరూ కనిపించలేదు కాని, ఒక చిరుతపులి కనిపించింది.

దాన్ని చూస్తూనే జనంలో కొందరు, "ఈ మధ్య చీకటిపడి పొలం నుంచి తిరిగొస్తున్న యిద్దరిలో, ఒకణ్ణి చంపి, రెండోవాణ్ణి గాయపరిచిన పులి యిదే! దీన్ని ప్రాణాలతో వదలగూడదు," అన్నారు.

ఆ వెంటనే జనం అక్కడ చేతికందిన రాళ్ళతో, చిరుతపులిని కొట్టారు. అది చెట్టుపై నుంచి కిందికి దూకింది. వెంటనే నలుగురూ కలిసి దాన్ని కత్తులతో, కర్రలతో కొట్టి చంపేశారు.

ఇది జరిగాక. వాళ్ళు దుర్గయ్యను, "ఏరా, దుర్గయ్యా! మనిషి మాంసం తినమరిగిన చిరుతపులి పల్లెలోకి వస్తే, దొంగలంటూ కేక పెట్టావెందుకు?" అని అడిగారు.

అందుకు దుర్గయ్య నవ్వి, "దొంగలంటూ నేను కేక పెట్టగానే, మీరంతా ధైర్యంగా కత్తులూ, కర్రలూ తీసుకుని ఇళ్ళల్లోంచి బయటికి వచ్చారు. అదే నేను పులి, పులి అని కేక పెడితే, మీరు బయటికి వచ్చేవారా? ఎవరిళ్ళలో వాళ్ళు, తలుపులు మరికాస్త గట్టిగా బిగించుకుని కూర్చునేవాళ్ళు?" అన్నాడు.

జనం వాడి సమయస్ఫూర్తిని ఎంతగానో మెచ్చుకున్నారు.

